నిమిషం ఆలస్యమైనా అనుమతించబోం

విశాలాంధ్ర - గోపాలపురం : బుధవారం నుండి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఒక్క నిమిషం లేటుగా వచ్చినా విద్యార్థులను రాయడానికి అనుమతించబోమని చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామ్స్, ఉభయ కళాశాలల కస్టోడియన్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి. ఉమాదేవి తెలిపారు. గౌతమి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్ష రాయు విద్యార్థులు 309 రెండవ సంవత్సరం పరీక్ష రాసేవిద్యార్థులు236 మందికి 12 రూములు ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ యువి రమణ ఆయన తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు 351, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 317 పరీక్షలు రాస్తున్నారని14 రూములు కేటాయించడం జరిగిందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. రూములలోసీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి విద్యార్థి అర గంట ముందుగా చేరుకొని రిపోర్టు చేయాలని తెలిపారు.

నులిపురుగుల నివారణ మందు పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగుల మందు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించినట్లు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కరప పిహెచ్సి పరిధిలో 12 సచివాలయాలు, 42 అంగనవాడీ కేంద్రాలు, 5 జూనియర్ కాలేజీలు, 46 ప్రైమరీ స్కూల్సు ఉన్నాయని తెలిపారు. ఈమందును 7,912 మందికి అందించనున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన ట్యాబ్లను ఆయా కేంద్రాలకు చేరవేసినట్టు తెలిపారు. ఈ మందును మొదటి సంవత్సరం నిండిన పిల్లలు నుండి 19 సంవత్సరాల వయసు వున్న అందరికీ డోస్ వేయనున్నామన్నారు.

కేసుల ఉపసంహరణ నిర్ణయం హర్షణీయం

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ జిల్లా పేరు మార్పు నేపథ్యంలో జరిగిన అల్లర్ల ఘటనలో పెట్టిన కేసులు ఉపసంహరించుతామని వైకాపా ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ మిధున్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువకాపునాడు ఇన్‌చార్జి నిమ్మకాయల సురేశ్, యువ కాపునాడు నాయకులు సిహెచ్ ప్రసాద్, మురమళ్ళ శివారెడ్డి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గత అల్లర్లతో ప్రమేయం లేని అనేక మంది అమాయకులను కేసుల్లో చిక్కుకుని వివిధ సామాజిక వర్గాలకు చెందిన పేదలు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ విషయాన్ని మానవతా దృష్టితో కేసులు ఉపసంహరణ చేసే నిర్ణయం ప్రకటించినందుకు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

19న సకల కళల ప్రదర్శనలకు ఎంపిక

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణంలోని సకల కళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం పలు కళల ప్రదర్శనా పోటీలకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సామర్లకోట సకల కళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బడుగు సీతారామరాజు (బాబీ), ఆర్.రాజు మాస్టారు, గౌరవ సలహాదారులు, ప్రముఖ దర్శకులు కెబి ఆనంద్ చెప్పారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ బుధవారం ఉగాది సందర్భంగా సకల కళా సమాఖ్య ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో కూచిపూడి, భరత నాట్యం, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, రంగస్థల నాటకాలు, సినీ గానలహరి కార్యక్రమాలతో ఉగాది ఉత్సవాలను సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దానిలో బాగంగా 19వ తేదీ ఆదివారం ఉదయం నుంచి స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నృత్య ప్రదర్శనలు, ఏకపాత్రాభినయం, పాటల పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న సామర్లకోట మండల పరిధిలోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు నన్నారు. వీటిలో ఉత్తమ ప్రదర్శనలు మూడేసి చొప్పున ఎంపిక చేసి ఉగాది పర్వదినం రోజున వాటిని ప్రదర్శింప జేయడంతో పాటు వారికి ఉత్తమ అవార్డులను అందించ నున్నట్లు వారు చెప్పారు. ఆశక్తి గల విద్యార్థులు 19వ తేదీ ఉదయం 9 గంటలకల్లా లయన్స్ క్లబ్ భవనంలో హాజరు కావాలని ఈ సందర్భంగా నాయకులు బాబీ, రాజు, ఆనంద్‌లు తెలిపారు.

15,975 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు కమిషనర్ కొండలరావు, ఎంపిడిఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం (నేషనల్ డి వార్మింగ్ డే) సందర్భంగా ఏలేశ్వరం నగర పంచాయతీ మరియు ఏలేశ్వరం మండల పరిధిలోని 116 కేంద్రాలలో గల పాఠశాల, కళాశాల, అంగన్వాడి కేంద్రాలలో ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి ఎస్,ఆశాలు 1-19 సంత్సరాల వయస్సు గల 16807 మంది పిల్లలకు గాను 15975 మంది (95%) పిల్లలకు నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమంలో (అల్బెండజోల్ 400ఎంజి) నులి పురుగుల నివారణా మాత్రలను మింగించినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి కె. భాస్కరరావు, మండల విద్యాశాఖ అధికారి బి. అబ్బాయి తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మంగళవారం ఆయా కేంద్రాలకు హాజరుకాని పిల్లలకు ఈనెల 18వ తేదీన మరొకసారి మాప్ అప్ డే నిర్వహించి 100 నూరుశాతం పిల్లలకు ఈ మాత్రలను మింగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడికి ఘన సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ విఎస్ దివాకర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు సాధనాల యల్లేశ్వరరావు, కల్వకొలను బాబు, రాజేష్, వినోద్, సంసాని బులినాని మట్టపర్తి నాగేంద్ర తదితరులు హాజరయ్యారు.

నూతన డ్రైనేజీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక గౌతమి నగర్‌లో నూతనంగా రూ.ఆరు లక్షల రూపాయలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులను కొత్తపేట ఎంపీపీ మార్గాన గంగాధర్ ప్రారంభించారు. వైసీపీ నాయకులు రాయుడు శేఖర్ ఇంటి వద్ద నుండి ప్రాథమిక పాఠశాల వరకు డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది. ఎంతోకాలంగా ఈ డ్రైనేజీ నిర్మాణం కోసం గౌతమి నగర్ వాసులు ఎదురుచూస్తున్నారు. గౌతమ్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు రాయుడు శేఖర్ స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఈ డ్రైనేజీ నిర్మాణం కొరకు నిధులను మంజూరు చేయించవలసినదిగా కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టారు. స్థానిక వైసీపీ కొత్తపేట జెడ్పిటిసి గూడపాటి రమాదేవి ప్రవీణ్, వైసీపీ మండల అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు, సత్తిరాజు ఉషారాణి, రేవడి నాగలక్ష్మి, స్థానిక వార్డు మెంబర్ పిల్లి శ్రీలక్ష్మి అనిల్, బొక్క లోకేష్, పంచాయతీ ఈవో వెంకట రామన్న తదితరులు పాల్గొన్నారు.

17న ఆర్ సెట్ స్పాట్ అడ్మిషన్స్

విశాలాంధ్ర - రాజానగరం : ఈ నెల 17వ తేదీన ఏపీ ఆర్ సెట్ అర్హత సాధించిన అభ్యర్థులకు నన్నయ విశ్వవిద్యాలయంలో పరిశోధనా ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు.ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనలో భాగంగా మంగళవారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ పరిశోధనా కేంద్రాలలో ఖాళీ సీట్ల కోసం ఈ నెల 17వ తేదీన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులందరూ స్పాట్ అడ్మిషన్స్ కొరకు హాజరు కావచ్చునన్నారు.ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఖాళీ సీట్ల వివరాలు, ఫీజు వివరాలు యూనివర్సిటీ వెబ్సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు

-కార్పొరేషన్ కమిషనర్ రమేష్
-మస్తరు కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాకినాడ బాల భవన్ వద్దనున్న మస్తర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్మికుల హాజరును పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరవుతున్నారో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ కొన్ని సర్కిల్స్‌లో రెగ్యులర్, ఔట్సోర్సింగ్ కార్మికులు విధులకు గైర్హాజరవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కొంతమంది బాధ్యతా రాహిత్యంగా ఎటువంటి సమాచారం లేకుండా విధులకు రాకపోవడం, గైర్హాజరు కావడం వంటి ఫిర్యాదులు ఉన్నాయని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే ఔట్సోర్సింగ్ కార్మికులను విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెగ్యులర్ కార్మికులు కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తే వీరిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారహిత్యం ఏమాత్రం ఉపేక్షించ బోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తడి-పొడి చెత్త సేకరణ, ఇంటింటికి చెత్త సేకరణను పరిశీలిం చారు. అక్కడి శానిటరీ ఇన్స్పెక్టర్, కార్మికులకు సూచనలు ఇచ్చారు. అనంతరం వెంకట నగర్ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ రమేష్ పర్యవేక్షించారు. క్యాన్సర్ హాస్పిటల్ సమీ పంలో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థకు ప్రజలు సహకరించాలని, చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలోను వేయవద్దని కమిషనర్ కోరారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ రవివర్మ, సిబ్బంది ఉన్నారు.

వైఎస్ఆర్, జగనన్న కాలనీ లేఔట్‌లలో మౌలిక సదుపాయాల కల్పన

విశాలాంధ్ర - అమలాపురం : వైయస్సార్ జగనన్న కాలనీల లే ఔట్లలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా గృహ నిర్మాణాలు స్టేజ్ కన్వర్షన్ ద్వారా వేగవంతం చేయాలని గృహ నిర్మాణ సంస్థ, పంచాయితీరాజ్ ఇంజనీర్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, బడి బయటి పిల్లలు, 8వ తరగతి విద్యార్థులు బైజుస్ టాబ్‌ల వినియోగం అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. లేఅవుట్ల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్య క్రమాలు, గృహ నిర్మాణాల పురో గతిని ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత వర్కింగ్ సీజన్లో గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేసి స్టేజ్ కన్వర్షన్ ద్వారా యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా మధ్యాహ్నం భోజన పథకం ద్వారా బాల బాలికలకు పౌష్టికాహారం అందించి విద్యనేర్పడం పట్ల ఆసక్తిని పెంపొందించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో రాగిజావ సరఫరాను ప్రారంభించనున్నదని కావున రెండు రోజులు ముందుగా ఉపాధ్యాయులు రాగిజావ తయారీపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని దీనికి సంబంధించి వీడియోను విడుదల చేయనున్నట్టు ఆయన స్పష్టం చేశారు. జిల్లా అంతా ఒకే నాణ్యతతో రాగిజావ సరఫరా చేయాలని ముందుగా ఉపాధ్యా యులు తయారు చేయబడిన రాగిజావ రుచిని పరిశీలించి మంచి నాణ్యతతో ఉన్నది లేనిది గమనించి తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు సరఫరా చేయాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజుస్ ట్యాబ్లు వినియోగంపై ఆయన సమీక్షిస్తూ ప్రతివారం టాబ్లు ఏ మేరకు విని యోగిస్తున్నది లేనిది సాంకేతికత ఆధారంగా పరిశీలించి ఎక్కువగా వినియోగించేలా శాతం వినియోగంలోకి తెచ్చేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ, కె చంటిబాబు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఇంజనీర్ ఎం బాబురావు, డీఈవో ఎం కమల కుమారి, డిఆర్డిఏ పిడి వి. శివశంకర్ ప్రసాద్, ఎడ్యుకేషనల్ మౌలిక వసతుల కల్పన డిఇ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బలుసుతిప్ప వాసులకు తీరని బస్సు సమస్య

విశాలాంధ్ర - కాట్రేనికోన : పేరుకు పెద్ద గ్రామం బలుసుతిప్ప. మండలంలో దాదాపుఅన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నా ఇక్కడి వారికి మాత్రం బస్సు ప్రయాణం గగనంగా మారింది. ఎన్నో ఏళ్లగా ప్రభుత్వాలు మారుతున్నా బస్సు సౌకర్యం నెరవేరని కలగానే మిగిలిందని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు. ఎన్నికల్లో నాయకులు చేసే వాగ్దానాలు మాత్రం గాలిలో కలిసిపోతున్నాయనే చెప్పాలి. రోడ్డు సరిగా లేదని, నష్టాలు వస్తున్నాయంటూ సాకుగా చూపి బలుసు తిప్పకు బస్సు నడపలేమని తాజాగా ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. గతంలో అమలాపురం నుండి బలుసు తిప్పకు నడిపిన బస్సును నిలిపివేయడంతో సముద్ర తీరంలోని బలుసు తిప్ప, పల్లంకురు శివారు ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు రవాణా, ప్రయాణ సౌకర్యం లేక నానా ఇక్కట్లు పడుతున్నారు. వెంటనే ఆ బస్సును పునరుద్ధరించాలని ఓ ప్రయాణికుడు ఇటీవల ప్రజా సమస్యల వేదిక స్పందనలో వినతి చేశాడు. దీనికి స్పందనగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి ఎం. నాగేశ్వరరావు సమాధానం ఇస్తూ ప్రస్తుతం అమలాపురం డిపో నుండి పల్లంకురు, వల్లం గ్రామాలకు రోజూ 24 సింగిల్స్‌తో 5 బస్సులు నడుపుతున్నామన్నారు. పల్లంకురుకు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న బలుసుతిప్ప గ్రామం వరకు రోడ్డు అత్యంత ఇరుకైన సింగిల్ రోడ్డు కావడంతో బస్సు తిప్పటానికి అనుకూలంగా లేదని ఆయన తెలిపారు. ఈ గ్రామానికి బస్సు ప్రయాణికులు ఆదరణ చాలాతక్కువగా ఉండడంతో గత 15 సంవత్సరాల నుండి బస్సు నిలిపివేసామని, ప్రస్తుత పరిస్థితులలోనూ బలుసుతిప్పకు బస్సు నడపలేమని ఆ అధికారి లేఖలో పేర్కొన్నారు. దీంతో భవిష్యత్తులోనైనా బస్సు నడుస్తుందని తమ కష్టాలు తీరుతాయని ఎదురుతెన్నులు చూస్తున్న స్థానిక మత్స్యకారులు, ఎస్సీ వర్గాలకు ఆర్టీసీ అధికారులు తీరుతో నిరాశే ఎదురైంది. ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేసి ఆర్టీసీ అధికారులను ఒప్పించి బలుసుతిప్పకు బస్సు నడిపించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్ నందు ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ నుండి వచ్చేనెల 4వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్ష లకు సంబంధించిన పరీక్షా కేంద్రాన్ని మంగళవారం రావులపాలెం సర్కిల్ సీఐ రజిని కుమార్, స్థానిక ఎస్సై శివ ప్రసాద్, తాసిల్దార్ ఐపీ శెట్టి, మండల విద్యాశాఖ అధికారి డి. మురళి సత్యనారాయణలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు తప్ప మిగతావారు 100 మీటర్ల దూరంలో ఉండాలని, పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున జిరాక్స్ సెంటర్లను ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1గం. వరకు మూసివేయాలని షాపుల యజమానులకు హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక వీఆర్వోలు, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడీ ఉమామహేశ్వర్ రెడ్డి, డాక్టర్ సాయి భాస్కర్ సేవలు భేష్



విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏడి ఉమామహేశ్వర్ రెడ్డి, డాక్టర్ సాయిభాస్కర్ ఆపరేషన్ నిర్వహించి ప్రాణంపోశారు. అనునిత్యం పాడి రైతులతో ఉంటూ పాడి పశువుల అభ్యున్నతి కృషి చేస్తూ పశువులు, జంతువులకు మెరుగైన వైద్య సేవలు అందించడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండల పరిధి వేదిరేశ్వరం గ్రామానికి చెందిన వీధి కుక్క దాడిలో పెంపుడు కుక్క తీవ్ర గాయాల పాలైంది. దీంతో యజమాని సోమవారం పశు వైద్యశాలకు తీసుకురావడంతో ఏడి ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సాయిభాస్కర్ మెడభాగం వద్ద అరుదైన శస్త్ర చికిత్స అందించి పెంపుడు కుక్క ప్రాణాలు కాపాడారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యశాల డాక్టర్ సాయి భాస్కర్, శివ, సిబ్బందితో ఆపరేషన్ నిర్వహించారు.

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్ట అమలుకు చర్యలు

-కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో చట్టం అమలు తీరుపై సమావేశంలో చర్చించారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించిన అంశాలను అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. కాకినాడ జిల్లాలో 2022, ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో 84 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి దశలోనూ వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.రమేష్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పీబీ విష్ణువర్ధిని, డీఐవో డాక్టర్ ఐ.ప్రభాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి, డీఎస్పీ ఎస్.రాంబాబు, డెమో సీహెచ్ఎస్‌వీడీవీ ప్రసాదరాజు తదితరులు హాజరయ్యారు.

ఉన్నత విద్యతోనే విజయకేతనం సాధ్యం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతిఒక్కరు ఉన్నత విద్యావంతులు కావాలని తద్వారా విజయ కేతనం ఎగరవేయ్యాలని గైట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.లీలావతి అన్నారు. మండలంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రగణంలో గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లిమాధవి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన లింగసమానత్వం అనే చర్చావేదికలో పలువురు విద్యావంతులు ప్రసంగించారు.దీనిలో భాగంగా వైస్ ప్రిన్సిపాల్ లీలావతి మాట్లాడుతూ మహిళాలు అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. గైట్ డీన్ డాక్టర్ వి.కుసుమకుమారి మాట్లాడుతూ గతంతో పోల్చిచూస్తే ప్రస్తుత సమాజంలో మహిళల్లో జీవన పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు.ప్రస్తుతం 56 శాతం బాలికలు వివిధ కళాశాలల్లో ఉద్యోగులగా రాణిస్తున్నారన్నారు. అలాగే సోషల్ మీడియాలో 35శాతం మహిళలు, బాలికలు గురువుతునట్లు తెలిపారు. సోషల్ మీడియా పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు.దీనిలో భాగంగా గైట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీగౌరీ రెడ్డి,గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ హెచ్వోడి ఆర్.విజయలక్ష్మి తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు.

చాగల్లు పరీక్షా కేంద్రం నిడదవోలుకు తరలింపు

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని నిడదవోలుకు తరలించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పావని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 50 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు 83 మొత్తం 133 మంది విద్యార్థులు నిడదవోలు పరీక్షా కేంద్రంలో బుధవారం నుండి పరీక్షలకు హాజరవుతారని ఆమె తెలిపారు.

అధికారుల ముందుకు పంచాయతీ సమస్యలు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో సీతానగరం గ్రామంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన ఎంపిడివో కె. రమేష్ ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సింగవరం సర్పంచ్ సంగన చినపోసియ్య తమ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణ కష్ట తరంగా మారుతోందని తమకు ట్రాక్టర్ కేటాయించాలని, తమ పంచాయతీ ఆదాయం తక్కువగా ఉండడం వల్ల నిర్వహణ కష్టంగా ఉందని అన్నారు. కైలాస గిరి ర్యాంపు నుండి బొండు మట్టి తవ్వకాలు జరిపి వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతున్నాయని ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు మార్చాలని పలు గ్రామాల సర్పంచ్‌లు విద్యుత్ అధికారులను కోరారు. చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారయణ రాజు, ఎంఈఓ స్వామినాయక్, ఏఓ గోపాల్, జెడ్పీటీసీ చలమల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సత్యం మదన్ బాబు, కో కన్వీనర్ కె. హరిబాబు, సర్పంచ్ కె. ముత్యాలు మొదలగు అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట సత్యవేణిపేటలో వెలసిన సత్తెమ్మతల్లి గుడి వద్ద మంగళవారం జాతర మహోత్సవాలు ఆలయకమిటీ పెద్దలు, భక్తులు, కాలనీ వాసులు నిర్వహించినట్టు ఒమ్మి రఘురామ్ ఒక ప్రకటనలో తెలియజేసారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలతో అమ్మ వారిని భక్తులు ఆరాధించారన్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని అమ్మ వారి ఊరేగింపులో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ జాతరలో ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మ వారి కృపా కటాక్షాలు పొందాలని, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించాలని కోరారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

మాస్టర్ ప్లాన్ మేరకు రోడ్డు విస్తరణ పనులు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : బుధవారం నుంచి రాజమహేంద్రవరంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.. దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక షెల్టన్ జంక్షన్ ప్రాంతంలో మంగళ వారం రోడ్డు విస్తరణ ప్రాంతాలను నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, నగరంలో రహదారుల విస్తరణ పనుల తొలిదశ లో భాగంగా షెల్టన్ జంక్షన్ నుండి తిలక్ రోడ్డు వరకు విస్తరణ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్ నుండి షెల్టన్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు . హైవే నుండి అధిక సంఖ్యలో వాహనాలు నగరంలోకి ప్రవేశించడం, మోరంపూడి నుండి షెల్టర్ వరకు ఉన్న రోడ్డు రద్దీగా ఉండటం వల్ల విస్తరణ పనుల కు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. తొలిదశ లో 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్టు దినేష్ కుమార్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పనులు చేపడుతున్న దృష్ట్యా నగర పౌరులంతా ఆయా పనులు పూర్తి అయ్యేవరకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరహాల బాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించండి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణ లో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న 2,32,000 పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నులి పురుగుల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎస్ కే ఆర్ ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ మాధవీలత, మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ వైద్యాధికారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 1700 సంస్థల్లో నులి పురుగు నివారణ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు 2 లక్షల 32 వేల మందిని గుర్తించి వారికి అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థు లతో ముచ్చటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తూ పాఠశాలలను ఆధునికరిస్తూ మౌలిక సదుపా యాలను కల్పిస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్ మాట్లాడుతూ ఒకటి నుండి 19 ఏళ్ల లోపు పిల్లలందరికి నులిపురుగుల నివారణ మందులు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కే. దినేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే వెంకటేశ్వరరావు, డి ఎల్ ఎ టి ఓ డాక్టర్ ఎన్. వసుందర, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విన్నూత్న, ప్రోగ్రాం ఆఫీసర్ టి.డాక్టర్ రాజీవ్, విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్షునిగా రాంబాబు

విశాలాంధ్ర - అనపర్తి : వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షునిగా రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు) నియమితులైనట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ అన్ని వర్గాలు, కులాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందని త్వరలో మిగిలిన వారికి కూడా కమిటీల్లో స్థానం కల్పిస్తామని తెలిపారు. అనంతరం పార్టీ మండల కమిటీ, పార్టీ మహిళా మండల అనుబంధ కమిటీ విభాగం, వాణిజ్య, ప్రచార, బీసీ సెల్, క్రిస్టియన్స్, రైతు, ముస్లిం మైనార్టీ, యువజన, సేవాదళ్, పంచాయితీ రాజ్, చేనేత, ఎస్ టి సెల్, ఎస్ సి సెల్, విద్యార్థి మండల అనుబంధ విభాగ కమిటీలను ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి స్వయంగా ప్రకటించారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గౌరీపట్నం జడ్పీ హైస్కూల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు టి సూర్య కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టి సూర్య కళ మాట్లాడుతూ పిల్లల్లో, కిషోర్ బాలల్లో కూడా నులిపురుగులు ఉన్నట్లయితే పిల్లల్లో రక్తహీనత పౌష్టికాహార లోపం వస్తుందని శారీరక మానసిక ఎదుగుదల వస్తుందని తెలిపారు. సి హెచ్ ఓ ఏ శ్రీకృష్ణుడు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకునేటప్పుడు ముందు అనంతరం చేతులు కడుక్కోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ ఎం ఫని శేఖర్ ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు అంగన్వాడీలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు అలాగే మండలంలో దేవరపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోను యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు.

పేకాట శిబిరంపై పోలీసు దాడులు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఒక గృహంవద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరం పై సామర్లకోట ఎస్‌హెచ్ఓ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో మంగళవారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ పేకాట పై కేసు నమోదు చేసి సిఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహనా సదస్సు



విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు మహిళా ఆరోగ్యానికి సంబంధించి ఒక అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపోలో హాస్పటల్స్ గైనాకాలజిస్ట్ డాక్టర్ పి. సంధ్య పాల్గొని మాట్లాడుతూ మహిళలలో ఇటీవల కాలంలో తరచుగా ఏర్పడే పిసిఒడి పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి విద్యార్థినితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలకు తగు జాగ్రత్తలు సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం లో భాగంగా మండలంలోని గొల్లపల్లి పి హెచ్ సి నందు వైద్యులు డాక్టర్ పి శ్రీనివాస్ గౌతమ్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు విద్యార్థుల ఆరోగ్యాన్ని పెంపొందింపచేస్తా యన్నారు. వైద్యురాలు డాక్టర్ పి. అనూష మాట్లాడుతూ మంగళవారం మాత్రలు అందని విద్యార్థులకు ఈనెల 18వ తేదీన అందజేస్తామన్నారు. పీ హెచ్ సి పరిధిలో 5752 మంది విద్యార్థులకు గాను 5470 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ గుంట్రూ శ్రీనివాసరావు, పద్మావతి ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్ది ఆంజ నేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మంగళవారం సందర్భంగా మండలం లోని గురవాయిగూడెం గ్రామంలో ఉన్న శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కీసరి విజయభాస్కర రెడ్డి కుమారుడికి ఇటీవల వివాహం జరగడంతో నూతన దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు . ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కుబడులు తీర్చుకుని, స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులు (నాగవల్లీ దళములు)తో అష్టోత్తరం పూజలను, అన్నప్రాసనలు, వాహన పూజలను నిర్వహించుకొన్నారు. దేవస్థానమునకు వివిధ సేవల రూపంలో రూ. 1లక్ష 7వేల474లు సమకూరినట్లు ఈఓ కొండలరావు తెలిపారు. సుమారు 1000 మంది భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా ఆలయ ధర్మకర్తలు మల్నీడి మోహనకృష్ణ, దండు వెంకట కృష్ణంరాజు, బల్లే నాగలక్ష్మి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తగిన ఏర్పాట్లు చేశారు.

వ్యాయామంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: సరైన వ్యాయామం లేని కారణంగా చిన్న వయసులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారని, ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేసి ఒత్తిడిని తగ్గించుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి భవానీ ప్రసాద్ అన్నారు. స్థానిక పిరమిడ్ వద్ద క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్క్ ను సందర్శించిన కమీషనర్ దృష్టికి అక్కడికి వచ్చిన ప్రజలు సీనియర్ సిటిజన్స్ పలు సమస్యలను తీసుకువచ్చారు. పార్క్‌లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో సాయంత్రం చీకటి పడితే పార్క్ కి వచ్చిన పిల్లలు, వృద్ధులు విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నారని తెలియ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ సమస్యపై సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే ఎలిజా, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని తెలియచేశారు. ఆయనతో పాటు పి. డి. నరసింహ రాజు, వాకర్స్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద మంగళ వారం జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పత్స మట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో ఉప్పాకపాడు ఎంపీటీసీ ఇంటి మంగరాజు జెండాను ఆవిష్కరించారు. తొలి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు,వీర మహిళలు,జన సైనికులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ సభకు తరలి వెళ్లిన జనసైనికులు

విశాలాంధ్ర-ఉంగుటూరు: మచిలీపట్నంలో జరిగే జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభకు ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు జనసేన పార్టీ కార్యాలయం నుంచి 60 చిన్నకారులు, 20 బస్సులు ర్యాలీతో మచిలీపట్నం తరలి వెళ్లారు. నియోజవర్గంలో ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల నుండి జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. వెయ్యి మంది పైగా భోజనాలు ఏర్పాటు చేశారు.

ఆరోగ్యవంతమైన పిల్లలు నులి పురుగుల బారిన పడొద్దు

విశాలాంధ్ర - గణపవరం: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులను నిషేదిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్య క్రమం చేపట్టిందని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మంగళవారం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పి సంతోష్ నాయుడు, డాక్టర్ కిరణ్మయిలు పాల్గొని మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్ర తీసుకొనుట వలన పోషకాహార లోపము, రక్తహీనత వల్ల నీరసం ఉండదని,శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డాక్టర్ టి అక్కిరాజు, డాక్టర్ కె స్వరూప రాణి, డాక్టర్ సిహెచ్ అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి రమేష్ కుమార్, డివివి చిన సత్యనారాయణ, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జనసేనతోనే సాధ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: సామాజిక న్యాయం జనసేనపార్టీ తోనే సాధ్యం అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తెలిపారు. ఏపిగుంట పంచాయతీ శ్రీరామ వరంలో కార్యకర్తలు బయలు దేరిన బస్సును మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో జరిగే 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్ళారని ఆయన తెలిపారు. మచిలీపట్నం సభకు హైటెక్ బస్ లు ఏర్పాటు చేసిన ఎన్ ఆర్ ఐ జనసేన అభిమానులు సత్య వెజ్జు, వంశీ పసుపులేటి, సింగంసెట్టి నాగ సుబ్రహ్మణ్యం లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవ రాజు సురేష్, తోట సాయి, పాపోలు సుబ్రహ్మణ్యం,పాలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులు నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర -ఉండి : బాల బాలికలలో నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. ఉండి మండలం ఎస్ఆర్ పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాను నాయక్ మాట్లాడుతూ బాలబాలికలలో నులిపురుగుల వలన రక్తహీనత నీరసం వంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఏర్పడతాయని వాటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పంజా ధర్మ తేజ మాట్లాడుతూ తమ పరిధిలో 96 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆర్ కృష్ణ కుమార్, ఏఎన్ఎం లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి ప్రియాంక పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం త్రాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సమీపించడంతో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ఉండటంకోసం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు సమోదయ్యే అవకాశం ఉందనే హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు త్రాగునీరు అందించడంలో అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని దానికి సంబంధించిన కార్యాచరణ రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. శునకాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలు గుర్తించి అక్కడ నీటితో టబ్ లను ఏర్పాటు చేయాలని డిపివోకు ఆదేశాలిచ్చారు. జిల్లాలో 269 మంచినీటి చెరువులు ఉన్నాయని వీటిలో గోదావరి, కృష్ణ కాలువల ద్వారా 228 ట్యాంకులకు 90 నుంచి 70 శాతం వరకు నీటిని నింపడం జరుగుతుందని 25 ట్యాంకుల్లో 75 నుంచి 50 శాతం, మరో 10 చెరువుల్లో 50 నుంచి 25 శాతం, ఒక చెరువులో 25 శాతం నీరు నింపడం జరుగుతుందని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఓ కె. రవికుమార్, ఇరిగేషన్ ఎస్.ఇ శ్రీనివాసరావు, డిపిఓ మల్లిఖార్జున రావు, ఏలూరు మున్సిపల్ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, జేడి వ్యవసాయశాఖ రామకృష్ణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు , డ్రామా పిడి. రాంబాబు ఆర్ డబ్ల్యూఎస్ ఏఇలు, డిఇలు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ కార్యక్రమం

విశాలాంధ్ర-పెంటపాడు : స్థానిక డి ఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాం బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాథమిక కేంద్రం వైద్యురాలు డా.మౌనిక హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబు మాట్లాడుతూ ఈనాటి వాతావరణ పరిస్థితులు భౌతిక పరిస్థితులు శారీరక పరిస్థితులు అర్థం చేసుకొని విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మౌనిక విద్యార్థులకు ఆరోగ్యము పోషణ విషయాల్లో కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్, ఎంపవర్మెంట్ సెల్ ఎన్సిసి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మహమ్మద్ అజహర్ అహ్మద్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర -భీమవరం: ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న మహమ్మద్ అజహర్ అహ్మద్ కు చెన్నైలోని అన్నా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన డాక్టర్ మహమ్మద్ అజహర్ అహ్మద్ మాట్లాడుతూ అన్నా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కంద స్వామి రాజా పర్యవేక్షణలో అప్లికేషన్స్ ఆఫ్ ఇంటిలిజెంట్ కంట్రోలర్ స్కీమ్స్ ఫర్ పవర్ జనరేషన్ అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను తనకు పి.హెచ్.డి అవార్డు అయిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ను ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి.ఆర్.కె.వర్మ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రానున్న ఎన్నికలలో జనసేన విజయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : జనసేన పార్టీ10 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండలంలో సరిపల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ (రవి) కేక్ కటింగ్ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పార్టీ స్థాపించడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ ఆంధ్ర రాష్ట్రంలో విజయకేతనం ఎగరవేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పన ప్రసాద్, వమిశెట్టి మధు, సరిపల్లి, వేదాంతపురం, రామనుజపురం గ్రామాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - అంబాజీపేట : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ గౌతమి, ఇంద్రావతిల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నులు పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమం ఆత్రేయపురంలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ, అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ 1, పేరవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జి మాట్లాడుతూ మండలంలో ఆత్రేయపురం, ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేశారన్నారు. ఈ మాత్రలవల్ల విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొంది, తద్వారా వారిలో విద్యాభివృద్ధికి దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాదరావు, పేరవరం సర్పంచ్ గంటి విజయ భారతీ నాగేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమా గణేష్, హెల్త్ కో ఆర్డినేటర్లు ఏఎన్ ఎమ్లు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

అల్బండజోల్ మాత్రల పంపిణీ

విశాలాంధ్ర-నిడదవోలు: ప్రతి చిన్నారి నులిపురుగుల నివారణకోసం ఆల్బండజోల్ మాత్రను తప్ప కుండ వేసుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంసాలిపాలెం సచివాలయం విలేజ్ హెల్త్ సెక్రటరీ కనికెల్లిశేషు కుమారి అన్నారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం లోని పాఠశాలలు,అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు నులిపురుగుల నిర్మూలన కు ఆల్బండజోల్ మాత్రలు ఇచ్చి మాత్రను చప్పరించి , నమిలి మింగేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ పిల్లల్లో నులి పురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్త హీనత ఏర్పడి నీరసం, కాళ్ళు చేతులు లాగడం తో పాటు పలు అనారోగ్య బారిన పడ తారన్నారు. నులిపురుగుల వల్ల పిల్లలు శారీరక మానసిక లోపాలు కలిగి ఉంటారని శేషుకుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాసు,క్రాంతి, గంగారత్నం, ఎమ్ఎల్ హెచ్ పి.అమృత, ఆశాలు వెంకటలక్ష్మీ, సుజాత, జీ యస్ యం కె. మణికంఠ, అంగన్‌వాడీ వర్కర్లు వెంకాయమ్మ, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం మంగళ వారం విజయవంతంగా జరిగింది. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరముల లోపు పిల్లలు కిషోర బాలలకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, మరియుప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో వేయబడ్డాయి మంగళవారం డి వార్మింగ్ వేయబడని కిషోర్ బాలలకు ఈనెల 18వ తేదీ శనివారం మాప్ అప్ చేయడం జరుగుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తనూజ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాగల్లు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. వీర్రాజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మరియు కళాశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, మహర్షి స్కూల్ కరస్పాండెంట్ బడేటి రమేష్, హెల్త్ అసిస్టెంట్ కె. నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య పారామెడికల్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

అభివృద్ధి కానరాని జగన్ పాలన

విశాలాంధ్ర - నిడదవోలు: వైసీపీ ప్రభుత్వం లో అన్ని రంగాలు కుంటు పడ్డాయని, జగన్ పాలనలో నిడదవోలు లో అభివృద్ధి కానరావడం లేదని నిడదవోలు టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు.నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషా రావు ఆధ్వర్యంలో నిడదవోలు19వ వార్డులో ఇదేంఖర్మమనరాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ,యూనిట్ ఇన్‌చార్జి ఎండి ఇస్మాయిల్ ఖాన్,షేక్ కరీం,అస్మత్ వినోద్,దొడ్డి రామారావు, సుబ్బరాజు, ఏకరాము, ఏక లక్ష్మి, యస్కెమస్తాన్, వరప్రసాద్, నంగాలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంకు జనసైనికులు

విశాలాంధ్ర - దేవరపల్లి: మచిలీపట్నంలో జరుగుతున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు గోపాలపురం నియోజకవర్గం నుండి డి.సువర్ణ రాజు ఆధ్వర్యంలో జనసైనికులు బయలుదేరారు. దేవరపల్లి లో పార్టీ జెండా ఆవిష్కరించి జండా ఊపిసువర్ణ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోపాలపురం, దేవరపల్లి మండలాలకు చెందిన జనసైనికులు, వీర మహిళలు బయలుదేరారు. నల్లజర్లలో నల్లజర్ల ద్వారకాతిరుమల మండలాలకు చెందిన జనసేన నేతలతో కలిసి మచిలీపట్నం బయలుదేరారు. ప్రతి జన సైనికుడు పార్టీ జెండా చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు డి సువర్ణ రాజుతోపాటు పార్టీ ముఖ్యులు కంబాల సత్తిబాబు, చప్పటి శివ నాగ ప్రసాద్, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, పోలుమాటి నాని, కవల సీతారత్న సూర్యకుమారి, డి.ఆనందప్రసాద్, సిద్ధా తాతబ్బాయి, గేలం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల ఆరాధ్యదైవం కార్ల్‌మార్క్స్

విశాలాంధ్ర -రాజానగరం : కార్మిక,కర్షక కష్టజీవులకు ఆరాధ్యదైవంగా కార్ల్ మార్క్స్ ఉంటారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) అధ్యక్షులు జన్నుపల్లి సత్తిబాబు,సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి. వెంకట్ నాయుడు అన్నారు.ఆర్థికవేత్త, సామాజికవేత్త, సోషలిస్టు విప్లవకారుడైన కార్ల్ మార్క్స్ 140వ వర్థంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ,అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావుపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక,కర్షక కష్టజీవులకు ప్రపంచంలో ఒక సిద్ధాంతాన్ని అందించి శ్రమ జీవుల రాజ్యాల స్థాపనకు దిక్సూచిగా పని చేశారన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు మరికుర్తి వీరలక్ష్మి, తామరల గౌరీ, నక్క లక్ష్మి , వర్శ, దుర్గ, తోటకూర బేబీ, ఎలా అరుణ, సరస్వతి, జగదంబ తదితరులు పాల్గొన్నారు.

7,912 మందికి నులిపురుగుల మందు పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగుల మందును మంగళవారం 7,912 మందికి పంపిణీ చేసినట్టు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కరప పిహెచ్‌సి పరిధిలో 12 సచివాలయాలు, 42 అంగన్‌వాడీ కేంద్రాలు 5 జూనియర్ కాలేజీలు 46 ప్రైమరీ స్కూల్ నందు 7,912 మందికి అందించామన్నారు. దీనికి సంబంధించిన సిబ్బంది ఆయాకేంద్రాలకు వెళ్ళి ముందు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈమందును మొదటి సంవత్సరం నిండిన పిల్లలు నుండి 19 సంవత్సరాలు వయసు వున్న అందరికీ వేశామని పేర్కొన్నారు.

శ్రీనివాస కళాశాలలో

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవమును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చేపట్టింది. ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ళ వయసు వారికి ఆల్బెండజోల్ మాత్రల్ని 353 కళాశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. భోజనం అనంతరం మాత్రలు తీసుకొనుట ద్వారా నులిపురుగు నివారణతో బాటు భావి భారత పౌరుల్ని ఆరోగ్య వంతులుగా ఉంచేందుకు ప్రభుత్వము తీసుకొన్నటువంటి చర్యలు ఉపకరిస్తాయని, ప్రతి విద్యార్థి విధిగా మాత్రలను స్వీకరించాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రత్నరాజు, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్ రాజు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఏడాది వయసు మొదలుకొని 19 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఆల్బెండెంజల్ టాబ్లెట్ వేసుకోవాలని, డాక్టర్ జె. శ్రీనివాస్ సూచించారు. డాక్టర్ వి వి దుర్గాభవాని పర్యవేక్షణలో.మంగళవారం హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రైవేట్ కాలేజీలు అంగన్వాడీ కేంద్రాలు మండల ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్ లోని విద్యార్థులకు సుమారు 5606 ఆల్బెండాజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే వీరభద్రుడు, హెచ్ వి ఆర్ నీలవేణి, ప్రసాదు, త్రిమూర్తులు, రూతమ్మ, మంజుల, కన్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1నుండి 19 సంవత్సరాల పిల్లలకు,కిషోర బాలికలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేసినట్టు ఆయన తెలిపారు. టాబ్లెట్స్ డీవార్మింగ్ చేయబడని పిల్లలకు ఈ నెల 18వ తేదీన జరిగే మాప్-అప్ రోజున ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎన్ టి స్వామి, సిహెచ్ ఓ పి ప్రసాదరావు,ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర-భీమడోలు: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోజు జనసేన పార్టీ భీమడోలు కార్యకర్తల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు, తరువాత మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన మరి జీవి పొట్టి శ్రీరాములు పుణ్య వేదిక వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మరాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో ప్రతి మదన్,నిమ్మకాయల ఘన,దౌలూరు సునీల్,వేమన దుర్గాదేవి, దౌలూరి సునీల్, లోకరాజు, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ

విశాలాంధ్ర - ముసునూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి విద్యార్థికి నులిపురుగు మాత్రలు వేస్తున్నట్లు రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని16 గ్రామాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న విద్యార్థిని ,విద్యార్థులకు నూటికి 96.7శాతం మందికి నులిపురుగుల మాత్రలు వేసినట్లు తెలిపారు.మిగతా వారికి బుధవారం వేస్తామని తెలియచేశారు.

నేటి నుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 15వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయని శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రఘు మంగళవారం తెలిపారు.పరీక్షలు ఉదయం 9-00 గంటల నుండి మధ్యాహ్నం 12-00 గంటల వరకు జరుగుతాయని విద్యార్థిని విద్యార్థులు ఉదయం 8 -30 నిమిషాలకు కాలేజీ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు త్వరగా రావాలని ఆయన కోరారు. 9-00గంటలు విద్యార్థులు పరీక్షకు హాజరైతే ఆ విద్యార్థి లోనికి ప్రవేశం లేదని ప్రభుత్వం కచ్చితంగా నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం రెగ్యులర్ 275 మంది ,ప్రైవేట్ 29 మంది మొత్తం 304 మంది హాజరవుతారని, అలాగే ద్వితీయ సంవత్సరం 245 మంది రెగ్యులర్ 51 మంది ప్రవేటు మొత్తం 296 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

95% మందికి నులి పురుగుల మందు పంపిణీ

విశాలాంధ్ర - గండేపల్లి : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు అల్బెండజోల్ మాత్రలు వేశారు.గండేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ గండేపల్లి మండలంలో 1 సం. నుండి 19 సంవత్సరం లోపు పిల్లలు 6575 మంది ఉన్నట్లు గుర్తించామని తెలియజేసారు. మంగళవారం 95% పిల్లలకు మాత్రలు మింగించామన్నారు. మంగళవారం మాత్రలు వేసుకోనివారికి 18వ తేదిన ఇస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా గండేపల్లి గవర్నమెంట్ స్కూల్ , అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. విద్యార్థులు అందరు తప్పని సరిగా మాత్రలు వేసుకోవాలని కోరారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేసారు. వయసును బట్టి 1 సం. నుండి 2 సంవత్సరముల వరకు అర మాత్ర అల్బెండజోల్-200 మి.గ్రా, 2 సం. 19సం. వరకు ఒక మాత్ర అల్బెండజోల్-400 మి.గ్రా మింగించడం జరుగుతుందని తెలియజేశారు. కడుపులో నులిపురుగులుంటే పోషకాహార లోపం, రక్త హీనత, శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు కలిగి ఉంటారని తెలియ జేసారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.